క్లుప్తంగా

సమస్యల సత్వర పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ భావన పేర్కొన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్ ద్వారా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఫోన్‌లో 15 సమస్యలు వచ్చాయి. అనంతరం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 మంది నేరుగా ఫిర్యాదులు అందజేశారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



రత్నకుమారికి సొమ్ము అందజేస్తున్న కమాండెంట్ దీపికా పాటిల్

కాకినాడ రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన ఏపీఎస్పీ కమాండెంట్ ఎస్.దివాకర్ కుటుంబానికి కమాండెంట్ దీపికా పాటిల్ సోమవారం సహాయాన్ని అందజేశారు. బెటాలియన్ క్యాంప్ కార్యాలయంలో దివాకర్ భార్య రత్నకుమారికి ఫ్లాగ్ ఫండ్ రూ.25 వేలతో పాటు విడో ఫండ్ రూ.50 వేలను అందించారు.

పీఆర్‌జీ ప్రిన్సిపాల్‌పై విచారణ

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం కళాశాలలో ఆర్‌జేడీ శోభారాణి విచారణ చేపట్టారు. కళాశాలలకు చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు కళాశాలలో పరీక్ష విభాగంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ విద్యాకమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో విచారణ చేపట్టారు.

రవాణా చార్జీలు అందించాలని వినతి

కరప: సార్వా సీజన్‌లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రవాణా చార్జీలు రైతులకే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో సోమవారం పిటిషన్ ఇచ్చినట్టు వేళంగి రైతు వాసిరెడ్డి మోహనరావు తెలిపారు. మధ్యదళారీల దోపిడీని అరికట్టి, రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని అంతవరకు బాగానే ఉందని, రవాణా చార్జీలు ట్రాక్టర్ యజమానికి చెల్లించడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. రైతుల వద్ద ట్రాక్టర్లు ఉండనందున 75 కిలోల బస్తా రైసుమిల్లుకు చేరవేసేందుకు రూ.80 చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం రవాణా చార్జీలు రైతులకే చెల్లిస్తానంటున్నా, రైతులకు అందడం లేదన్నారు. రైతులకు రవాణా చార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించాలి

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లకు మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నగర కో-కన్వీనర్ పలివెల వీరబాబు కోరారు. సోమవారం ఆయన ఈ అంశంపై కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నగరపాలక సంస్థ మంచినీటి విభాగంలో వాహనాలు, వాటికి అవసరమయ్యే ఇంధనాన్ని కార్పొరేషన్ సమకూరుస్తూ జీతాలు చెల్లింపునకు థర్డ్‌పార్టీ కాంట్రాక్టు ఏ మాత్రం సమంజసం కాదన్నారు. జీవో 36 ప్రకారం డ్రైవర్లకు కనీస వేతనంగా రూ.24,500లు చెల్లించాలని, ప్రతి నెలా 1న జీతాలు ఇవ్వాలని, వారంతపు, ఇతర సెలవులు మంజూరు చేయాలన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పవన్, మల్లేశ్వరరావు,. వెంకటేష్, సురేష్, నరేష్, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.7 లక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గత సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వర్షాలతో నిరాశ్రయులైన వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రగతి విద్యాసంస్థలు ఆర్థిక సహాయం చేశాయి. జిల్లా పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సోమవారం వెంకటాపురం గురుకుల పాఠశాలలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సమక్షంలో ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎస్.పూర్ణ చంద్రరావు రూ.7లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ ప్రగతి విద్యాసంస్థల యాజమాన్యాన్ని, విద్యార్థులను అభినందించారు.

గురి పెడితే పతకమే..

- రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తున్న డీఎస్‌ఏ మాటర్స్
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో కోచ్ సమీర్



జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారిణికి మెళకువలు నేర్పుతున్న కోచ్ సమీర్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అందరి లక్ష్యం ఒక్కటే.. జాతీయ స్థాయిలో పతకం సొంతం చేసుకోవడమే... లక్ష్యం వైపే గురి పెడుతూ మొక్కవోని ఏకాగ్రతతో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీలు, గత నెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై తోటి క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీలో కోచ్ సమీర్ వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై రోజూ ఉదయం , సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో వారు తమ మనోభావాలు పంచుకున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే...

యూనివర్సిటీ నేషనల్స్‌కు ఎంపికయ్యా



నేను పెద్దాపురం ఎంఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. రెండేళ్లుగా డీఎస్ఏలో రైఫిల్ షూటింగ్ నేర్చుకుంటున్నాను. భీమవరంలో జరిగిన అంతర కళాశాలల పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. కానిస్టేబుల్ కావడమే నా కోరిక.

– జి.మల్లేశ్వరి, క్రీడాకారిణి, పెద్దాపురం

చాలా ఆనందంగా ఉంది



మాది ఉప్పాడలో మత్స్యకార కుటుంబం. కాకినాడ ఐడియల్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. పిస్టల్ విభాగంలో రజత పతకం సాధించాను. అక్కున తరఫున ఇంటర్ యూనివర్సిటీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. కోచ్ సమీర్ వద్ద శిక్షణ పొందుతున్నాను. డిఫెన్స్‌లో ఉద్యోగం సాధించడం లక్ష్యం.

– జి.కాశి, క్రీడాకారుడు, ఉప్పాడ

గ్రూప్-1 ఉద్యోగమే లక్ష్యం



నేను పెద్దాపురం మహారాణి కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నా. రైఫిల్ షూటింగ్‌లో రాణించి గ్రూప్-1 ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం. ఏడాదిన్నర నుంచి డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాను. భీమవరం నిర్వహించిన పోటీల్లో కాంస్య పతకం సాధించాను.

– ఎం.హర్షవర్ధన్, క్రీడాకారుడు, పెద్దాపురం

నేషనల్ మెడల్ సాధిస్తా...



నేను ఇంటర్ చదువుతున్నాను. రాజమహేంద్రవరంలో గత నెల 27న నిర్వహించిన అండర్-17 పీప్ సైట్ రైఫిల్ షూటింగ్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్నాను. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ కూడా బంగారు పతకం సాధించడమే నా లక్ష్యం.

– షేక్ మోహియుద్దీన్, కాకినాడ

రైఫిల్స్, పిస్టల్స్ కావాలి



డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీలో సరిపడా పిస్టల్స్, రైఫిల్స్ లేవు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు మెరుగైన శిక్షణకు అవసరమైన ఎక్విప్‌మెంట్ ఉంటే ఇంకా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అప్పుడే క్రీడాకారులు రాణించేందుకు అవకాశం ఉంటుంది

– సమీర్, కోచ్, డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీ, కాకినాడ

భవిష్యత్తు విద్యార్థులదే..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



విద్యార్థినులనుద్దేశించి ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

కాకినాడ రూరల్: దేశాన్ని అభివృద్ధి చేయడం నిజమైన దేశభక్తుని లక్ష్యమని, భవిష్యత్తు మీదే అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విద్యార్థులకు సూచించారు. రూరల్ మండలం పి.వెంకటాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. తొలుత పాఠశాలలో బయోలాజికల్ ల్యాబ్‌లను సందర్శించి, విద్యార్థినుల ప్రదర్శనలను తిలకించారు. ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థినులతో మాట్లాడి అక్కడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలలో ఇంటర్ వరకూ ఉన్నందున డిగ్రీ వరకూ అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. అనంతరం ఆడిటోరియంలో పాఠశాల విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం తాగడానికి నీరు లేని పరిస్థితులను చూస్తున్నామని, ఆక్వా కల్చర్ పేరుతో తాగడానికి నీరు లేకుండా చేస్తున్నారన్నారు. చదువుతో పాటు ఇష్టమైన వాటిపై ప్రవీణ్యాన్ని సంపాదించుకోవాలన్నారు. జిల్లాలో 30 జెడ్పీ స్కూల్స్ సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఈ గురుకుల పాఠశాల మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరు చేశామని ప్రకటించారు. కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పాల్గొన్నారు.

కన్నబాబు విజన్‌తోనే ఆదర్శంగా..

నేటి బాలలే రేపటి పౌరులు అంటారు. పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే విద్య ప్రధానం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పేదింటి మెరిట్ బాలికలు ఉన్నత చదువులకు కోసం ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా గురుకుల పాఠశాలను తీసుకువస్తే... కాకినాడ రూరల్ పి.వెంకటాపురం చక్కని వేదిక అవుతుందని ముందు చూపుతో ప్రస్తుత వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి కురసాల కన్నబాబు తాను తొలిసారి ఎమ్మెల్యేగా అయిన వెంటనే పాఠశాలను తీసుకువచ్చారు. విశాలమైన అందమైన భవనాలు నిర్మించడానికి కృషితో పాటు నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. పదో తరగతితో చదువులు ఆగకూడదని ఇంటర్మీడియట్‌ను కన్నబాబు తీసుకువచ్చారు. ఆయన కృషితో సరస్వతి నిలయంగా మారిన బాలిక గురుకుల పాఠశాల నేడు రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలగా నిలుస్తుంది. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సందర్శన కోసం వచ్చినప్పుడు పి.వెంకటాపురం గురుకుల పాఠశాల బెస్ట్‌గా జిల్లా కలెక్టర్ ఎంపిక చేయడంతో కన్నబాబు నాటి కృషి ఫలితం కళ్లకు కట్టినట్టు అయ్యింది.

జీజీహెచ్ మేనేజర్ చుట్టూ ఉచ్చు

డిప్యూటీ కలెక్టర్ చైర్మన్‌గా విచారణ

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వైవీఎస్ఎన్ నరసింగరావు అనర్హులకు నర్సింగ్ పోస్టులు విక్రయించి సొమ్ము చేసుకున్నాడనే ఆరోపణలు గుప్పుమన్నాయి. 2020లో చోటు చేసుకున్న ఈ బాగోతం ఓ ఫిర్యాదుతో బట్టబయలైంది. కలెక్టర్ షణ్మోహన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిలకు ఈ మేరకు తేదీలు ప్రస్తావించి, ట్రాన్‌సాక్షన్ వివరాలు పొందుపరిచి మరీ పూర్తి ఆధారాలతో ఈ ఫిర్యాదు అందడం చర్చనీయాంశమైంది. పక్కా ఆధారాలతో కూడిన ఫిర్యాదులు కావడంతో కలెక్టర్ ఆదేశాలలో సూపరింటెండెంట్ తక్షణమే చర్యలకు దిగారు. ఈ మేరకు గత నెల 24న విచారణ కమిటీని నియమించి ఒక్క రోజైనా ఆలస్యం లేకుండా అదే రోజు విచారణ ప్రారంభించారు. విచారణ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ ఆర్.శ్రీధర్ వ్యవహరిస్తుండగా కమిటీ సభ్యులుగా ఆర్ఎంసీ ఏడీ శ్రీనివాస్, జీజీహెచ్ ఏవో శేషేంద్రశర్మ ఉన్నారు. తాజా వివాదం 2020లో కోవిడ్ విపత్కర వేళ నర్సుల రిక్రూట్‌మెంట్ జరిగింది. అదే ఏడాది జూన్‌లో 278 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా డిసెంబర్‌లో నియామకాలు జరిగాయి. ఇందులో నరసింగరావు అన్నీ తానై వ్యవహరించి అడ్డగోలుగా వ్యవహరించాడనే ఆరోపణలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. పైగా లంచాలు గుంజుకొని అనర్హులకు పోస్టులు కేటాయించి కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించాడనే విషయాన్ని విచారణ కమిటీ తీవ్రంగా పరిగణిస్తోంది. జిల్లా యూనిట్ పరిధిలో ఓపెన్ కేటగిరీలో కేవలం 20 శాతం పోస్టులు మాత్రమే లోకల్, నాన్ లోకల్‌కు కేటాయించాల్సి ఉంది. అలా గణాంకాల ప్రకారం 278 పోస్టుల్లో 20 శాతం అంటే 56 పోస్టులు రావాలి. 57వ పోస్టు నుంచి లోకల్స్‌కి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి. అలా కాకుండా నరసింగరావు లంచాలు తీసుకొని మరో ఏడుగురికి పోస్టులు ఇచ్చాడని ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో కంగుతిన్న విచారణ కమిటీ మరింత లోతుగా వాస్తవాలు రాబట్టడం కోసం 20కి పైగా ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసి నరసింగరావుకు ఇచ్చారు. 24 గంటల వ్యవధిలో సమాధానాలు ఇవ్వాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినా, ఇప్పటికి రెండు వారాలు గడిచాయి. నరసింగరావు నుంచి మాత్రం సదరు ప్రశ్నలకు సమాధానం లేదు. విచారణలో ఉండగా ఉద్దేశపూర్వకంగా సెలవులు పెడుతూ సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకుంటున్నాడనే కారణంతో మంగళవారం మెమో జారీ చేసేందుకు కమిటీ నిర్ణయించింది.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి



పలివెల వీరబాబు
సీపీఎం నగర కార్యదర్శి

కాకినాడ సిటీ: కాకినాడ నగరంలో పేదల సొంతింటి కల నెరవేర్చాలని సీపీఎం నగర మహాసభ డిమాండ్ చేసింది. ఆదివారం రాత్రి సీపీఎం నగర మహాసభ త్రైవార్షిక విస్తృతి సమావేశం అనంతరం సీపీఎం జిల్లా నాయకుల పర్యవేక్షణలో పార్టీ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ నగర కన్వీనర్‌గా పలివెల వీరబాబు, కమిటీ సభ్యులుగా కె.సత్తిరాజు, మలకా వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, నాగాబత్తుల సూర్యనారాయణ, ఎం.సూరిబాబు, సీహెచ్ వేణు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ నగరంలో ప్రజా సమస్యలపై సీపీఎం తీర్మానాలను తెలియజేశారు. నగరంలో సొంతిల్లు లేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో స్థలం ఉన్నవారికి ప్రభుత్వం రూ. 5 లక్షల హౌసింగ్ రుణం మంజూరు చేయాలని, ఉపాధికి ఇబ్బంది లేకుండా నగరాన్ని చేర్చి కాలనీలు నిర్మించాలన్నారు. కాకినాడ జగన్నాథపురం మూడోవ వంతెన, అచ్యుతాపురం ఫ్లైఓవర్ నిర్మించి నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. నగరంలో పాడైన ఇంటర్నల్ రోడ్లన్నీ పునర్నిర్మించాలని, మెయిన్ డ్రైన్ పూడికలు ఎప్పటికప్పుడు తీయించి ముంపు నివారించాలని కోరారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి పడకల స్థాయిని 2500లకు పెంచి వైద్య సేవలు మెరుగుపరచాలన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలి



కలెక్టరేట్ వద్ద దీక్ష చేపట్టిన దూసర్లపూడి రమణరాజు

కాకినాడ సిటీ: కాకినాడ పరిధిలో ఎనిమిది గ్రామాలను విలీనం చేసి, సత్వరమే కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలంటూ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. రెండేళ్లుగా ఎన్నికలు లేక నగరానికి రావాల్సిన రూ. 20 కోట్ల ఆర్థిక సంఘం నిధులు రాలేదన్నారు. విలీన గ్రామాల తాత్సారంతో గతంలో 2010 నుంచి ఎన్నికలు జరగక రూ.60 కోట్ల ఆర్థిక సంఘం నిధులు వెనక్కి పోయాయన్నారు. తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, స్వామినగర్, టీచర్స్ కాలనీలకు ఎన్నికలు జరగక రూ. 140 కోట్లు నిధులు వెనక్కి పోయాయన్నారు. జమిలీ ఎన్నికల బిల్లు తీసుకువస్తున్న నేపథ్యంలో తక్షణమే విలీన గ్రామాల పెండింగ్ పూర్తి చేసి ఎన్నికల నిర్వహించకుంటే మరో మూడున్నర ఏళ్ల పాటు ఆర్థిక సంఘం నిధులు తీసుకురావడం సాధ్యం కాదన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందుగా ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు.

నాగుల చవితి శోభ

బోట్‌క్లబ్: నగరానికి నాగుల చవితి శోభ వచ్చింది. మంగళవారం నాగుల చవితి కావడంతో సోమవారం పలు ప్రధాన కూడళ్లలో పూజా సామగ్రి విక్రయించారు. స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల వద్ద భక్తుల కోసం తాత్కాలికంగా పుట్టలు ఏర్పాటు చేస్తున్నారు. సినిమా రోడ్డులోని నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో చవితి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కోనేరు వద్ద తాత్కాలికంగా పుట్టలు ఏర్పాటు చేసినట్లు ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. భానుగుడి వద్ద నున్న భానులింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కోసం తాత్కాలిక పుట్టలు ఏర్పాటు చేశారు. స్థానిక రామారావుపేటలోని శివాలయం, దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి, బోట్‌క్లబ్ వద్ద నున్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు. రిజర్వు పోలీస్‌లైన్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో అర్చనలు, హోమాలు జరుగుతున్నాయి.

ఓం శివాయ నమః



భానులింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



కరపలో రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

బోట్‌క్లబ్: కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచలి కార్తీక్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భానులింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారిని సుమారు ఐదు వేల మంది దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు, అయ్యప్ప దీక్షాధారులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. రామారావుపేటలోని శివాలయంలో దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరప మండలంలో..

కరప: స్థానిక పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. ఈఓ కె.తిరుమల రవితేజ, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. విష్ణ్వాలయంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామివారికి ప్రధాన అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు పూజాదికాలు నిర్వహించారు. కూరాడ శివారు చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ధర్మకర్త మెర్ల వీరయ్య చౌదరి ఏర్పాట్లు చేశారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు పూజలు నిర్వహించారు.

ఘనంగా కుంభ హారతి



సూర్యారావుపేట సాగర తీరంలో సముద్రుడికి పూజలు

కాకినాడ రూరల్: పవిత్ర కార్తీక మాసం తొలి సోమవారం పురస్కరించుకుని కాకినాడ భోగి గణపతి పీఠం ఆధ్వర్యంలో సూర్యారావుపేట సముద్ర తీరంలో సాగరుడికి కోటి వత్తులతో కార్తిక పూర్ణకుంభ హారతి ఇచ్చారు. భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు భక్తులు కలిసి తొలుత కలశ ప్రతిష్ఠ, పసుపు కుంకుమలతో అష్టోత్తర పూజ, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రంతో మంగళకర సంకీర్తనలతో నైవేద్యం సమర్పించారు. విష్ణు, శివ లలితాదేవి సహస్ర నామ పారాయణ చేసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ తీరాల్లో సముద్రుడికి పూర్ణ కుంభ హారతితో ఆరాధన చేయడం సనాతన సంప్రదాయమన్నారు.

చిత్రకారిణి రజనికి మొదటి బహుమతి



జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న చిత్రకారిణి రజని

బోట్‌క్లబ్: ఒంగోలు పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో సృష్టి ఆర్ట్ అకాడమీ, కళాయజ్ఞ సంస్థలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో కాకినాడకు చెందిన వి.రజని మొదటి బహుమతి గెలుచుకొంది. చిత్రకళా అవార్డుతోపాటు రూ. 10 వేల నగదు బహుమతిని సాధించారు. ప్రాచీన భారతం పేరుతో ఈ చిత్రకళా ప్రదర్శన నిర్వహించగా పోటీల్లో మన దేశానికి చెందిన ప్రముఖ పురాతనమైన సుల్తాన్ గంజ్ బుద్ధ రాగి శిల్పం చిత్రాన్ని అక్రిలిక్ కలర్స్‌తో చిత్రించడం జరిగిందని చిత్రకారిణి రజని సోమవారం విలేకర్లకు తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతి రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రథమ బహుమతి సాధించిన రజనిని కాకినాడకు చెందిన పలువురు చిత్రకారులు అభినందించారు.

డీఆర్వోను కలసిన ఎన్జీఓ నేతలు



డీఆర్వో వెంకటరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉమ్మడి జిల్లా ఎన్జీఓ ప్రతినిధులు

కాకినాడ సిటీ: కాకినాడ డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన జె.వెంకటరావును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్జీఓ సంఘ ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీఆర్వోని కలసిన వారిలో ఎన్జీఓ సంఘ జిల్లా ప్రతినిధులు గుద్దటి రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సత్తిరాజు, రామకృష్ణ, బి.సుజాత తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి



కొరిపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కరప: రైతులు తమ భూములకు సంబంధించి సమస్యలు ఉంటే గ్రామసభల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ అన్నారు. కొరిపల్లిలో సోమవారం సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు అధ్యక్షతన రీ సర్వే గ్రామసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ భూవి స్తీర్ణంలో తేడాలున్నా, పేర్లు తప్పుగా పడినా, సర్వే నంబర్ల సబ్ డివిజన్ చేయించుకోవాలన్నా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు దేవిశెట్టి సూర్యప్రకాష్, మాజీ సర్పంచ్ ఆర్‌వీ సత్యనారాయణ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, వీఆర్వో పీవీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లాప్ వాహన డ్రైవర్ల భిక్షాటన

కాకినాడ సిటీ: క్లాప్ డ్రైవర్లు మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ చేపట్టిన ఆందోళన సోమవారంతో 11వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కాకినాడ కలెక్టరేట్ నుంచి డ్రైవర్స్ అందరూ భిక్షాటన చేసుకుంటూ జిల్లా పరిషత్, జీజీహెచ్, బాలాజీ చెరువు, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడుతూ మూడు నెలల నుంచి జీతాలు లేక కార్మికులు భిక్షాటనకు దిగాల్సి వచ్చిందన్నారు. త్వరలో వేతనాలు వేయకపోతే కుటుంబాలను పోషించుకోవడం కష్టమై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అధికారులు పరిశీలన చేసి వెంటనే వేతనాలు వేయాలన్నారు. ఇస్మాయిల్, సంతోష్, దుర్గాప్రసాద్, దుర్గబాబు, ఆర్.వెంకటేష్, అరుణ్‌కుమార్, కొండబాబు, శ్రీను, భద్ర, భైరవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి పోటీలకు జట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు మంగళవారం జిల్లా నుంచి వెళ్లాల్సిన జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక జార్జి సోమవారం తెలిపారు. అండర్-14, 17 బాలుర సాఫ్ట్‌టెన్నిస్, అండర్-14 బాల బాలికల అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ జట్లు, 6న అండర్-14 బాల బాలికల ఖోఖో, 7న అండర్-14 బాల బాలికల హాకీ, అండర్-14, 17 బాలబాలికల రోప్ స్కిప్పింగ్, మల్కాంబ్, అండర్-17 బాలుర నెట్‌బాల్ జట్లు బయలుదేరి వెళ్లాలన్నారు. అదేవిధంగా 8న అండర్-14 టేబుల్ టెన్నిస్, కబడ్డీ, బేస్‌బాల్, వాలీబాల్, రగ్బీ, టెన్నికాయిట్, అండర్-17 సెపక్‌తక్రా, బేస్‌బాల్, బాలుర బ్యాడ్మింటన్, మోడ్రన్ పెంటాథలాన్, బాలికల హ్యాండ్‌బాల్, ఘట్కా, టెన్నికాయిట్ జట్లు వెళ్లాలని పేర్కొన్నారు.

7న సీపీఎం మండల మహాసభ

కాకినాడ రూరల్: సీపీఎం రూరల్ మండల మహాసభను ఈ నెల 7న ఇంద్రపాలెంలో జాని కమ్మ కల్యాణ మండపంలో జరుగుతుందని పార్టీ రూరల్ మండల కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. మహాసభలో కార్యకలాపాలపై సమీక్ష, భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించడం, పార్టీ అభివృద్ధికి తీర్మానాలు చేస్తారని ఆయన తెలిపారు.